# శ్రీ షిరిడీ సాయి వైభవమ్



శ్రద్ధ సబూరి

సంపుటి 1 సంచిక 7 జూన్, 2018

సాయి దర్బార్, హైదరాబాద్

వ్యవస్థాపకులు, సలహాదారు : సాయి బానిస శ్రీ రావాడ గోపాలరావు గారు

నిర్వహణ : ఆత్రేయపురపు త్యాగరాజు, నిజాంపేట, హైదరాబాద్



Late Shri Hari Sitaram Dixit

## కాకా సాహెబ్ దీక్షిత్ డైరీ

## బాబా అడిగిన పైకం వెనుక పరమార్థం

ఒకసారి నేను (కాకాసాహెబ్ దీక్షిత్ షిరిడీలో ఉండగా శంకరరావు కూడా అక్కడికి వచ్చాడు. శ్రీసాయిబాబా అతనిని 16 రూపాయలు దక్షిణ అడిగారు.

అతని వద్ద అంత పైకం లేదు. కాని ఈ విషయం అతను బాబాకు చెప్పలేదు. బాబా స్వయంగా దక్షిణ అడిగినా తాను ఇవ్వలేకపోయానని చాలా బాధపడి బసకు తిరిగి వచ్చాడు. ఈ విషయం గురించే ఆలోచిస్తూ తన ఊరికి తిరిగి వచ్చాడు. మరొకసారి అతను షిరిడీ వచ్చి బాబాను దర్శించుకున్నపుడు బాబా 32 రూపాయలు దక్షిణ అడిగారు. ఈ సారి కూడా తను బాబాకు దక్షిణ ఇవ్వలేకపోయినందుకు చాలా బాధపడ్డాడు. ఈ విషయం నాకు చెప్పాడు. నేను నవ్వి,, "శ్రీసాయిబాబా పైకం గురించి అడిగినపుడు నీదగ్గిర లేదని చెప్పవచ్చు కదా. మౌనంగా ఎందుకు వున్నావు" అన్నాను. ఈ సారి కనక బాబా దక్షిణ అడిగితే అదే చెబుతాను అన్నాడు శంకరరావు .

మేమిద్దరం కలిసి మసీదుకు వెళ్ళినపుడు శ్రీసాయిబాబా శంకరరావుని 64 రూపాయలు దక్షిణ అడిగారు. "అంత డబ్బు మాదగ్గిర ఎలా ఉంటుంది బాబా" అని అన్నాము మేమిద్దరం. "మీవద్ద లేకపోతే అందరినీ అడిగి తీసుకు రండి" అన్నారు బాబా.

ఇది జరిగిన కొన్ని రోజులకి బాబాకు బాగా అనారోగ్యం చేసింది. శ్రీసాయిబాబా ఆరోగ్యం కోసం భక్తులు నామ సప్తాహం అన్నదానం నిర్వహించారు. ఆ సందర్భంగా దభోల్కర్ భార్య, వామన్ బాల కృష్ణారావు చందాలు వసూలుకు బయలుదేరాలనుకున్నారు. వామనరావు ఆకార్యాన్ని తన తమ్ముడయిన శంకరరావుకు అప్పగించి ఆవిషయం నాకు కూడా చెప్పాడు. ఆ తరువాత మేము చందాలు వసూలు చేశాము. చందాలన్నీ వసూలయిన తరువాత లెక్కపెట్టగా చందాల ద్వారా వచ్చిన మొత్తం సరిగా 64 రూపాయలు ఉంది. కొద్ది రోజుల క్రితం బాబా సరిగ్గా అదే మొత్తం అందరి దగ్గరా వసూలు చేయమని చెప్పిన విషయం గుర్తుకు వచ్చి ఆశ్చర్యపోయాము.

## ఆపద్బాంధవుడు:

31.03.1995 న నాచ్నే అతని సహోద్యోగి మోరేశ్వర్ పాన్సే ఒక ప్రభుత్వ సంబంధమయిన పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్నారు. వారు వచ్చే దారి చాలా దట్టమయిన అడవి. ఆ దారిలో ఒక్క ఎద్దులబండి మాత్రమే ప్రయాణ సాధనం. వారు తాన్ షెట్ ప్రాంతానికి చేరుకునేటప్పటికి అర్ధరాత్రయింది. ఆ అడవిలో పులులు తిరుగుతూ ఉంటాయి. హటాత్తుగా ఎడ్లబండి వెనుకకు నడవటం మొదలుపెట్టింది. ఎద్దులు అలా ఎందుకని వెనుకకు నడుస్తున్నాయో మాకు ఆశ్చర్యం వేసింది. ఎంత ఆలోచించినా మాకు మొదట కారణం తెలీలేదు. మేము వెళ్ళే రోడ్డు బాగా ఎత్తుగా ఉన్న రోడ్డు. ఒకవైపు లోయ, మరొక వేపు కొండలు ఉన్నాయి. ఎడ్లబండి ఇంకాస్త వెనుకకు వెళ్ళినట్లయితే అందరూ లోయలోకి పడిపోతారు.

అపుడు పాన్సే ఎదుటికి వేలూ చూపిస్తూ అటు చూడమన్నాడు. ఎదురుగా ఒక పెద్ద పులి మాకేసే చూస్తూ కనపడింది. ఆపులి రోడ్డుకు ఒక ప్రక్కనున్న కొండలలోంచి వచ్చింది. ఎద్దులు కనక భయంతో బెదిరి కొద్దిగా ప్రక్కకు తప్పుకుంటే బండి తలక్రిందులై లోయలో పడిపోతే మరణమే. ఒకవేళ బండి దిగి బండి పడిపోకుండా ఆపుదామన్నా పులి వచ్చి దాడి చేస్తుంది.

పాన్సే బండి దిగి, బండి వెనుకకు దొర్లిపోకుండా చక్రాల కింద రాయి పెట్టి ఆపుదామనుకున్నాడు. అతను మరొక వైపు నుంచి బండి దిగాడు. ఇంకా బండిలోనే కూర్చున్న నాచ్నే గట్టిగా అరుస్తూ, జయజయ సాయిబాబా పరుగున వచ్చి మమ్మాదుకోవయ్యా" అని అరిచాడు. అప్పుడా పెద్దపులి లేచి రోడ్డుకు కుడివైపునుండి దూకి వారివైపే చూస్తూ బండి ప్రక్కనుంచి వెళ్ళిపోయింది. పులి వెళ్ళిపోగానే ఎద్దులు పరుగు లంకించుకోవడం వల్ల ప్రమాదం నుండి బయట పడ్డారు. సద్గురు నామస్మరణే వారిని కాపాడింది.

## మహిమ మందులో లేదు.

ఒకసారి మాధవరావు దేశ్ పాండే (శ్యామా)మొలలు పెరిగి విపరీతంగా బాధపడుతున్నాడు. అతను శ్రీసాయిబాబా వద్దకు వెళ్ళి తన బాధను చెప్పుకున్నాడు. "మధ్యాహ్నం నేను మందు ఇస్తాను" అన్నారు బాబా. తన ప్రియమైన భక్తుని బాధను నివారించడానికి బాబా స్వయంగా సోనాముఖి ఆకు కషాయం తయారు చేసి, ఆకషాయాన్ని శ్యామాను వెంటనే త్రాగమని చెప్పారు. ఆమందు తీసుకోగానే నొప్పి తగ్గిపోయి మొలలు తగ్గిపోయాయి.

రెండు సంవత్సరాల తరువాత శ్యామాకు మరలా మొలలు పెరిగి బాధ పెట్టసాగాయి. అంతకు ముందు శ్రీసాయి ఇచ్చిన సోనాముఖి కషాయంతో తగ్గడం గుర్తుకు వచ్చి, బాబాకు చెప్పకుండా తానే యింట్లో స్వయంగా ఆమందు తయారు చేసుకొని తీసుకున్నాడు. కాని, ఈ సారి బాధ తగ్గకపోగా మరింత ఎక్కువయింది. శ్యామా బాధ భరించలేక బాబా వద్దకు వెళ్ళి తన బాధను గురించి చెప్పాడు. శ్రీసాయిబాబా తన దివ్యమయిన హస్తముతో ఆశీర్వదించగానే అతని బాధ మటుమాయమయింది.

ఈసంఘటన వల్ల తెలిసేదేమిటంటే బాబా ఆశీర్వాదంతోనే రోగాలు నయమవుతాయని. ఆయన ఆశీర్వాదములు విస్తారంగా ఉన్నపుడు ఎటువంటి మందులు అవసరం లేదని అర్థమవుతుంది.

అమృతవాణి:

సంత్ జ్ఞానేశ్వర్ రచించిన 'అమృతవాణీ చాలా ప్రసిధ్ధి చెందిన వేదాంత గ్రంధం. సామాన్యమానవుడు దానిని అర్థం చేసుకోవడం చాలా కష్టం. అందు వల్ల చాలా కొధ్ధిమంది మాత్రమే దానిలోని మాధుర్యాన్ని ఆస్వాదించగలిగేవారు. శ్రీసాయిబాబా భక్తుడయిన దాసగణు, ప్రతివారు చదివి అర్థం చేసుకోవడానికి వీలుగా దానికి ఓవీల రూపంలో టీకా రచించాలని సంకల్పించాడు. సతారాలో ఉంటున్న ప్రఖ్యాత పండితుడు, సాధువు అయిన దాదా మహరాజ్ కు తన సంకల్పాన్ని వివరించాడు దాసగణు. అమృతవాణిని గొప్పగా వివరించగల దిట్టగా దాదా మహరాజ్ ప్రఖ్యాతుడు. కాని, దాదా మహరాజ్ దాసగణు కోరికను ఏమాత్రం ప్రోత్సహించలేదు. టీకా, అనగా వ్యాఖ్యానం రాయాలంటే ముందు నీకు మూలం క్షుణ్ణంగా అర్థమయి ఉండాలి. నావద్ద కొద్ది మాసాలు ఉండి మూలాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చెయ్యి. ఆతరువాత వివరణ రాద్దువుగాని అన్నారు దాదా మహరాజ్. ఈ మాటలు దాసగణుకు రుచించలేదు. "నేను టీకా రచించడం సాయిబాబా సంకల్పమే అయితే దానికి అవసరమయిన జ్ఞానాన్ని, సామర్థ్యాన్ని ఆయన అనుగ్రహిస్తారు. అందుచేత ఈ విషయంలో నాకెవరి సహాయము అక్కరలేదు" అన్నాడు దాసగణు. దాసగణు ఉద్దేశ్యమేమిటో దాదా మహరాజ్ కి అర్థం కాలేదు. కాని దాసగణుకు సహాయం చేయమని ఆయన బాబాను ప్రార్థించారు.

కొంతకాలం తరువాత దాదా మహరాజ్, దాసగణు ఇద్దరూ కలుసుకొన్నారు. అప్పటికాయన రెండు అధ్యాయాలకు టీకా రాయడం పూర్తి చేశారు. దాదా మహరాజ్ దాసగణుని, నీటీకా రాయడం ఎంతవరకు వచ్చిందని అడిగారు. దాసగణు తను రచించిన రెండు అధ్యాయాల టీకాను చదివి వినిపించాడు. అది విన్న దాదా మహరాజ్ ఆ వ్యాఖ్యానాన్ని ఎంతో మెచ్చుకొని, బాబా నిజంగా ఎంతో సమర్థులు. ఆయన అనుగ్రహం వల్లనే నువ్వింతటి చక్కని టీకా వ్రాయగలిగావు. ఆయన ఆశీర్వాదంతోనే నువ్వింతటి కఠినతరమయిన కార్యాన్ని సాధించగలిగావు అని ప్రశంసించారు. నీకింకెవరి సహాయము అక్కరలేదు అన్నారు.

ఊదీ

శ్రీ దాజే వామన్ చిదంబర్ స్కూలు హెడ్ మాస్టర్ గా షిరిడీకి బదిలీ మీద వచ్చారు. ఆయన షిరిడీకి వచ్చిన కొంతకాలం తరువాత మేము (కాకాసాహెబ్ దీక్షిత్, ఇంకా మరికొంతమందిమి) కలుసుకున్నాము. మాటల సందర్భంలో ఆయన నాతో షిరిడీలో హెడ్ మాస్టర్ గా ఉద్యోగం చేయడం సంతోషంగా లేదని, కారణం విద్యార్థుల వల్ల తనకు చెడ్డ పేరు వస్తోందని చెప్పారు. పిల్లలు ఎవరూ సరిగా చదవటం లేదని చెప్పారు. వారి చదువు సరిగా లేదని దండించినప్పుడు, తాము బాబా వారిని ఊదీ అడిగుతామనీ ,ఆ ఊదీ మహాత్మ్యం వల్ల తామందరం పరీక్షలన్నిటిలోను ఉత్తీర్ణులవడానికి సహాయపడుతుందని పిల్లంలందరూ చెప్పారని అన్నారు. . బాబా వారినందరినీ పాడుచేస్తున్నారని అన్నారు హెడ్ మాస్టర్ గారు.

5, 6 నెలల తరువాత పరీక్షలు జరిగాయి. పిల్లలందరూ కూడా మంచి మార్కులతో ఉత్తీర్ణులయారు. ఇప్పుడాయనకు శ్రీ సాయిబాబా మీద చెప్పడానికి ఎటువంటి ఆరోపణలు లేవు.

(ఇంకా ఉంది)

## సాయి భక్తుల అనుభవాలు

### భక్త శబరి…???భక్తి పరీక్షా???

ఈ అధ్భుతమయిన లీలను మార్చ్, 18, 2016 న. తెలుగు బ్లాగులో ప్రచురించాను. మరలా యధాతధంగా సాయి భక్తులందరికోసం ఈ పత్రికలో ప్రచురిస్తున్నాను.

చెన్నై నుండి శ్రీమతి కృష్ణవేణిగారు 15వ. తీరీకున ఒక అనుభవాన్ని ఈ మెయిల్ ద్వారా పంపించారు. చాలా అద్బుతమైన అనుభవం. ఇంకా విచిత్రమేమంటే ఈ రోజు ప్రచురిస్తున్న ఈ అధ్భుతమైన లీలకు బాబా వారు మరికొంత సమాచారం కూడా ఇమ్మని నాకు సూచించారు. అది ఏవిధంగా ఇచ్చారన్న విషయాన్ని ఈ లీల పూర్తయిన తరువాత వివరంగా ఇస్తున్నాను.*** అది కూడా చదవండి. ఈ లీల ప్రచురించడానికి కూడా బాబావారి అనుగ్రహం ఏ విధంగా ఇచ్చారో మనం గ్రహించుకోవచ్చు.

శ్రీమతి కృష్ణ వేణిగారు పంపిన అనుభవం :

ఈ మధ్యనే జరిగిన ఒక లీల గురించి మీకు చెబుతాను. ఈ అధ్భుతమైన లీల క్రిందటి గురువారం జరిగింది. మా ఇంటిలో మేమంతా ప్రతిరోజు రాత్రి కూడా మామూలుగానే భోజనాలు చేస్తాము. కొంత మంది గురువారాలలో ఫలహారాలు చేస్తారు. నేను గత మూడు వారాలుగా రాత్రి చపాతీలు చేయడం మొదలు పెట్టాను. మొదటి చపాతీ బాబా గారికి నైవేద్యంగా సమర్పించవచ్చని నా ఉద్ధేశ్యం. కాని క్రిందటి వారం చపాతీలు చేద్ధామని చూస్తే పిండి అయిపోయింది. నేను ముందర గమనించలేదు. అప్పటికే రాత్రి 7 గంటలయింది.

మా అత్తగారు యోగా క్లాసులకి వెళ్ళారు. మా వారు ఇంటికి వచ్చేసరికి ఆలశ్యమవుతుందని ఫోన్ చేశారు. రాత్రి వేళ కావడం వల్ల పాపతో నేను బయటకు వెళ్ళలేక ఆ రోజుకి అన్నం వండేశాను. అపుడే బయట అరటి పండ్లు అమ్మే అతను వచ్చాడు. వెంటనే నేను అరటిపళ్ళు కొని బాబాకి చపాతీ బదులుగా రెండు అరటిపళ్ళను నైవేద్యంగా సమర్పించాను. ఆ రోజు రాత్రి మా మామయ్య గారు, అత్తయ్యగారు 8.30 కల్లా భోజనాలు చేసేశారు. రాత్రి 9-15 కి నేను, మావారు ఇద్ధరం భోజనాలు చేస్తున్నాము. ఇంతలో ఒక ముసలాయన ఆకలిగా ఉంది అన్నం పెట్టమని పిలిచారు. అప్పటికే మేమిద్ధరం సగం అన్నం తినేశాము. ఆ ముసలాయన ఒక స్టీలు కంచం కూడా తెచ్చుకున్నారు. ఆ సమయానికి మేము అన్నం తినేశాము. ఇంకా కొద్ధి అన్నం మిగిలితే పారవేయడం ఎందుకని ఇద్ధరం చెరి సగం పెట్టుకున్నాము. ఆ సమయంలోనే ఆ ముసలాయన అన్నం పెట్టమని అడగడం జరిగింది. మా ఇంటి వెనకాలే మా తోడికోడలు కూడా ఉన్నారు. ఆవిడని పిలిచి అడుగుదామనుకుంటే తలుపు వేసి ఉంది. వెంటనె నేను చేయి కడుక్కుని నేను కంచంలో పెట్టుకున్న అన్నాన్ని ఆముసలాయన కంచంలో వేశాను. మావారు కూడా తన కంచంలోని అన్నాన్ని కూడా అతని కంచంలో వేశారు. ఆ ముసలాయన అన్నంలోకి ఏదయినా వేయమని అడిగాడు. అప్పటికే మేము చాలా మట్టుకు భోజనాలు కానిచ్చేయడం వల్ల కేవలం పచ్చడి మాత్రమే మిగిలింది. మేము రాత్రి వేళల్లో మజ్జిగ అన్నం తినము. కూర, పచ్చడితో మాత్రమే తింటాము. పచ్చడి తీసుకుని వచ్చి అతని కంచంలో వడ్డించాను. ఆ ముసలతను గుమ్మం బయటే కూర్చుని అన్నం తిన్నాడు. మా వారు అతనికి త్రాగడానికి మంచి నీరు ఇచ్చారు. అయన అన్నం అంతా తిన్న తరువాత ఆఖరుగా ఒక పెధ్ధ అన్నం ముధ్ధను చేతిలోకి తీసుకుని ఇలా అన్నారు “నేను ఆఖరి ముధ్ధను కాకులకో లేదా పక్షులకో వేస్తాను నేను క్రింద వేసానని బాధపడకండి” అని ఒక విధంగా నవ్వి క్రింద వేశారు. వేసిన తరువాత మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళిపోయారు.

నేను బాబా దగ్గిర పెట్టిన అరటిపండ్లు రెండూ తెచ్చి ఒకటి మావారికి రెండోది నేను తిన్నాను. అపుడు నాకొక ఆలోచన వచ్చింది. ముసలాయన రూపంలో వచ్చి అన్నం పెట్టమని అడిగినది బాబాయేనేమోనని. వెంటనే వెబ్ సైట్ లో బాబా


ప్రశ్నలకు జవాబులలో ప్రశ్న తలచుకుని సమాధానం చూశాను. "ప్రతి జీవిలోను నన్నే చూడు" అని సమాధానం వచ్చింది.

ఇక్కడ నేను మీకు మరొక విషయం చెప్పాలి. అతనికి అన్నం సరిపోలేదేమోనని, అరటిపండు ఇస్తే వద్దన్నాడు. కారణం ఆ అరటిపండు అంతకు ముందే బాబావారికి నైవేద్యం రూపంలో చేరింది కనుక. జరిగినదంతా అర్ధం చేసుకునేసరికి నా కళ్ళల్లో నీరు వచ్చింది. దివినుండి భువికి దిగి వచ్చి మా ఎంగిలి మెతుకులు తిన్నారు బాబా అని చాలా బాధ కలిగింది. తరువాత మావారిని అడిగాను ఇతనిని ఇంతకు ముందు ఎప్పుడయినా ఈప్రాంతంలో చూసారా అని. గత 30 సంవత్సరాలుగా నేనితనిని ఇంతవరకు చూడలేదని చెప్పారు. కాని నాకు ఎక్కడో చూసిన విధంగా అనిపించింది. మళ్ళీ వస్తాను అని చెప్పారు కాబట్టి బాబా వారి రాక కోసం ఎదురు చూస్తున్నాను.

ఆ రోజు ఉదయం భక్తి టీ.వీ. లో ఉదయం 6.30 నుండి 7 గంటల వరకు ప్రసారమవుతున్న విజయేశ్వరీదేవిగారి ఆధ్యాత్మిక ప్రసంగం, పని చేసుకుంటూనే వింటు ఉన్నాను. ఆ రోజు ఆవిడ చెప్పిన ఉపన్యాసంలోని ఒక కధ కూడా చెపుతాను.

అతనికి నేను మిగిలిన అన్నం పెట్టినపుడు పొద్దున్న విన్న ఈ ప్రసంగం గుర్తుకు వచ్చింది.
(శ్రీమతి కృష్ణవేణి గారు ఉదయమ్ ఫోన్ లో ఆవిడ చెప్పిన కధను నాకు చెప్పడం జరిగింది. నేను గూగుల్ లో వెతికి ఆ కధను చదివాను. కధ మూడు విధాలుగా ఉన్నా గాని భావమ్ మాత్రం ఒకటే. విజయేశ్వరీ గారు చెప్పిన కధకి, నేను చదివిన ఈ కధకి చాలా మట్టుకు ఒకటే కనుక తేడా లేదు. ఆ కధను కూడా ఇక్కడ ఇస్తున్నాను. చదవండి.)


మహాభాతర యుద్ధం తరువాత యుధిష్టిరుడు సింహాసనాన్నదిష్టించి లోక కళ్యాణం కోసం యజ్ఞం చేసాడు. ఎంతో ధనం ఖర్చు చేసి వచ్చిన వారందరినీ లేదనకుండా దాన ధర్మాలు, విలువైన కానుకలతో సత్కరించాడు. గొప్ప అన్నదానాలు జరిపించుతున్నాడు. వచ్చిన వారందరూ తృప్తిగా భోజనాలు చేసి రాజును దీవించి వెడుతున్నారు. ఆ సమయంలో అక్కడికి ఒక ముంగిస వచ్చింది. దాని శరీరం ఒకవైపు భాగం బంగారంగా మారి ఉంది. అక్కడ అన్నదానం జరిగిన చోట క్రింద పడ్డ మెతుకులలో పొర్లడం మొదలు పెట్టింది.



దాని శరీరం మరొక వైపు భాగం సహజంగా ఉంది. రాజుతో సహా అక్కడున్నవారందరూ ఆశ్చర్యంతో దానినే గమనించసాగారు. ఆ ముంగిస పొర్లుతూ తన శరీరాన్ని చూసుకోవడం, మళ్ళీ మళ్ళీ పొర్లడం ఈ విధంగా చేయసాగింది. ఆ ముంగిసకు మాటలాడే శక్తి కూడా ఉంది. ఆ విచిత్రాన్ని గమనించిన యుధిష్ఠురుడు దాని ప్రవర్తనకి కారణమడిగాడు. అపుడా ముంగిస ఒక కధను ఈ విధంగా చెప్పింది.

"రాజా! ఒక రాజ్యంలో ఒక గ్రామంలో కడు బీదవాడు తన భార్య, కొడుకు కోడలితో నివసిస్తున్నాడు. వారికి పూటగడవని స్థితి. తినడానికే ప్రతిరోజూ కష్టంగా ఉండేది. ఆ కుటుంబంలోనివారంతా ఎంతో భక్తి తత్పరులు. ఒకసారి ఆ రాజ్యంలో కరువు సంభవించింది. ఇక వీరి కుటుంబంలో ప్రతిరోజూ పస్తులుండవలసి వచ్చింది. ఒకరోజు ఆ కుటుంబ పెద్ద బయటకు వెళ్ళి అతి కష్టంమీద కాసిని బియ్యం తెచ్చాడు. భార్య అన్నం వండి నలుగురికి సమాన భాగాలు చేసింది. సరిగా వారు ముద్ధ నోటిలో పెట్టుకోబోతుండగా తలుపు తట్టిన శబ్దమయింది. ఇంటి యజమాని తలుపు తీసి చూశాడు. బయట ఒక బాటసారి నిలబడి ఉన్నాడు. బాగా నీరసంతో ఆకలికి తాళలేక శోషవచ్చి పడిపోయేలా ఉన్నాడు. అపుడా యజమాని "అయ్యా! మీరు చాలా ఆకలితో ఉన్నట్లు కనబడుతున్నారు. లోపలికి రండని" ఆహ్వానించాడు. అపుడా బాటసారి తల ఊపి "అవును చాలా రోజులుగా నాకు తిండి దొరకలేదు. చాలా ఆకలితో ఉన్నాను" అన్నాడు. అపుడా యజమాని "అయ్యా! మీరు సరైన సమయానికి వచ్చారు. ఇపుడే మేము భోజనానికి కూర్చోబోతున్నాము" అని అతనిని భోజనానికి ఆహ్వానించి, తన భాగం అతనికి వడ్డించాడు. మిగిలినవారు ఇంకా అన్నం ముట్టకుండా ఆ అతిధినే చూస్తూ ఉన్నారు. ఆ బాటసారికి ఆకలి తీరకపోవడంతో మిగిలిన వారు కూడా ఒక్కొక్కరుగా తమ భాగాన్ని కూడా ఆయనకు వడ్డించి ఆయన ఆకలిని తీర్చారు. తృప్తి చెందిన ఆ బాటసారి లేచి బయటకు రాబోతుండగా ఇల్లంతా చాలా ప్రకాశవంతమయిన వెలుగుతో నిండిపోయింది. ఆ బాటసారి రూపంలో వచ్చిన భగవంతుడు వారితో " మీరు ఈరోజు లోకంలో అన్నిటికన్నా ఉత్తమమైన యజ్ఞం చేశారు. మీకు మోక్షాన్ని ప్రసాదిస్తున్నాను" అన్నాడు.

ఆ సమయంలో నేను ఆవైపు వెళ్ళడం, వారందరికీ మోక్షం కలగడం చూశాను. అక్కడ ఆ బాటసారి భుజించగా నేల మీద పడ్డ మెతుకులలో నేను పడటం జరిగింది. వాటిమీద పడ్డ నా శరీరం బంగారంగా మారిపోయింది. పడని భాగం సహజంగానే ఉంది. అప్పటినుండి మిగిలిన శరీరభాగం కూడా బంగారంగా మారుతుందనే ఆశతో ఎక్కడ యజ్ఞాలు జరిగినా అక్కడికి వెడుతూనే ఉన్నాను. కాని ఇంతవరకు ఫలితం కనపడలేదు. ప్రజలంతా నువ్వు ఎంతో గొప్ప యజ్ఞం చేస్తున్నావని పొగుడుతూ ఉంటే ఇక్కడకు వచ్చి, అన్నదానం జరిగిన చోట పడిన మెతుకులలో పొర్లుతూ ఉన్నాను. అయినా నా మిగిలిన శరీరభాగం బంగారంగా మారలేదు. ఆ బీదవాడు చేసిన యజ్ఞం కంటే నీ యజ్ఞం గొప్పది కాదు" అని ముగించింది. యుధిష్ఠురుడు మాట్లాడే లోపే ఆ ముంగిస అక్కడినుండి అదృశ్యమయింది.



యుధిష్టురునికి జ్ఞానోదయమయింది. యజ్ఞం చేయడానికి కావలసినది ధన కనక వస్తు వాహనాలు కాదు. ముఖ్యంగా కావలసినది స్వచ్చమయిన మనస్సు. మంచి దయార్ద్ర హృదయం. అంతే గాని విధి విధానాల ప్రకారం చేసిన యజ్ఞ యాగాదులు కాదు. కీర్తి కోసం, యశస్సు కోసం చేసిన యజ్ఞ యాగాదులు సత్ఫలితాలనివ్వవనీ, అన్ని దానాలకన్నా అన్నదానం మహత్తరమయినదని గ్రహించుకొన్నాడు.

ఆమె అనుభవాన్ని చదివిన తరువాత నాకు భక్త శబరి కధ గుర్తుకు వచ్చింది. భక్తురాలయిన శబరి విషయంలో శ్రీరామ చంద్రమూర్తి వారు మనకి ఏమని బోధించారో చూడండి.



"ముఖ్యంగా కావలసినది భక్తి. అంతేగాని కులం, మతం కాదు. మనం ఏమి సమర్పిస్తున్నాము అన్నది కూడా కాదు. శబరి రాములవారికి పండ్లను సమర్పించింది. పండ్లు పుల్లగా ఉన్నవేమోనని కాస్త కొరికి రుచి చూసి తియ్యటి పండ్లను ఆయనకు సమర్పించింది. శ్రీరామ చంద్రులవారు ఆమె ఎంగిలి చేసిన పండ్లను ప్రీతితో ఆరగించారు. ఆయన ఆమెలోని భక్తిని మాత్రమే చూశారు గాని, ఎంగిలి పండ్లను సమర్పించిందనే విషయాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. భక్తుడు భక్తితో సమర్పించినది ఏదయినా భగవంతుడు ప్రీతితో స్వీకరిస్తాడు."

అనుకోని అతిధిగా వచ్చి అన్నం పెట్టమని అడిగినవానికి ఎంగిలి మెతుకులు పెట్టామే అని బాధ పడినా, 38 వ.అధ్యాయంలో బాబా వారు చెప్పినట్లుగా సమయా సమయాలు చూడకుండా అతిధిని ఆదరించడం గృహస్థ ధర్మం. ఆ ధర్మాన్ని ఆవిడ పాటించారు. ఎంగిలి పెట్టాకూడదనే విషయాన్ని పక్కన పెట్టి ఆయన ఆకలిని తీర్చారు.
బాబాయే ఆ రూపంలో వచ్చారని భావిస్తే ఆయన ఆమెలోని భక్తిని పరీక్షించారని నాకనిపించింది. ఆయన పెట్టిన పరీక్షలో ఆమె నెగ్గిందని నేను భావించాను.

శ్రీ సాయి సత్ చరిత్ర 9వ.అధ్యాయం కూడా  గమనించండి. బాలారాం కొడుకు గోవింద్ తన తండ్రికి క్రియా కర్మ చేయటానికి  వెడుతున్నానని, తరువాత షిరిడీకి వెడతానని తర్కడ్ వద్దకు వచ్చి చెప్పాడు.  అతనితో బాబాకు ఏదైనా పంపాలని తర్కడ్ భార్యకు తోచింది.  కాని ఇది వరకే బాబాకు నైవేద్యంగా అర్పించిన పేడా తప్ప ఇంట్లో వేరే ఏదీ లేదు.  ప్రేమతో పెట్టితే ఏదైనా సాయి సంతోషంగా తిటారని ఆమె ఆ పేడాను ఆ అబ్బాయి సూతకంలో ఉన్నా అతని చేతికిచ్చి పంపింది. కాని గోవిందు షిరిడీలో బాబా దర్శనానికి వెళ్ళినప్పుడు పేడా గదిలోనే మర్చిపోయాడు. కాని బాబా అతనికి తర్ఖడ్ భార్య ఇచ్చిన పేడాను గుర్తు చేసి, అతని చేత తెప్పించుకుని ప్రీతితో ఆరగించారు.

***సాయి బంధువులయిన పాఠకులందరికి ఇక్కడ మరొక విచిత్రం చెప్పాలి.  ఈ లీలకు మరికొంత సమాచారం ఇమ్మని బాబా వారు సూచించారు.

నేను ప్రతిరోజు మణెమ్మగారు వ్రాసిన శ్రీసాయి సత్ చరిత్రను ఒక అధ్యాయం పారాయణ చేస్తూ ఉంటాను.  చదివిన తరువాత ఆ గ్రంధాన్ని ఒకసారి ముద్దు పెట్టుకుని, ఈ రోజు మీరిచ్చే సందేశం ఏమిటి అని అడిగి కళ్ళు మూసుకుని ఏదో ఒక పేజీ తీసి ఒక చోట వేలు పెట్టి చూస్తాను. అక్కడ ఏమి ఉందో చూసి చదువుతాను.   ఈ రోజు కూడా అదే విధంగా చూశాను.  ఈ రోజు చదివిన అధ్యాయం 38.  ఈ అధ్యాయం నిన్న కొంత చదివి ఈ రోజు పూర్తి చేశాను.  ప్రతి రోజు లాగే ఈ రోజు కూడా ఎప్పటిలాగే పుస్తకం మూసేసి కళ్ళు మూసుకుని బాబా ఈ రోజు మీరిచ్చే సందేశం ఏమిటి అని ఒక పేజీ తెరచి వేలు పెట్టిన చోట  కళ్ళు తెరచి ఏమి వచ్చిందో చూశాను.  ఆశ్చర్యం  --  బాబాగారు ఇచ్చిన సందేశం ఇక్కడ ఇస్తున్నాను. చదవండి.

కళ్ళుమూసుకుని పుస్తకం తెరిచిన తరువాత 38 వ.అధ్యాయంలోని పేజీలో వచ్చిన సందేశం .. “సమయా సమయాలలో అతిధులు వచ్చినపుడు వారిని అన్నదానంతో సుఖ పెట్టడం గృహస్థుల ధర్మం.  అన్నం పెట్టకుండా వారిని పంపి వేయడం అధోగతిని ఆహ్వానించుకున్నట్లే.  వస్త్ర పాత్రాది దానంలో పాత్రతను చూచి ఆలోచించి ఇవ్వాలి.  కాని

అన్నదానంలో ఆ ఆలోచన అవసరం లేదు.  ఇంటి ముందు ఎవరు ఎప్పుడు వచ్చినా అన్నం పెట్టకుండా వారి ననాదరం చేయటం ధర్మం కాదు.”

దీనిని బట్టి మన గ్రహించవలసిన విషయం ఆవిడ చేసిన అన్నదానానికి బాబావారు సరియైన అర్థాన్ని తెలియ చేసి మనకందరికీ హితబోధ చేశారు.



ఆనాటి ఋషులు – నేటి షిరిడి సాయి

రచయిత శ్రీ సాయిబానిస రావాడ గోపాలరావు

శ్రీషిరిడి సాయి జీవిత క్యాలండరు 1838 – 1969

(130 సంవత్సరములు)

షిరిడీలో జరిగిన ముఖ్య సంఘటనలు – 130 సంవత్సరములు

1838 లో శ్రీ సాయి జన్మించి ఉంటారని తన ఊహను హేమాద్రిపంతు శ్రీసాయి సత్ చరిత్రలో తెలియజేసారు. శ్రీ హేమాద్రిపంతు గారి వివరణ ప్రకారము – శ్రీసాయి పుట్టిన తేది ఆయన తల్లిదండ్రులు, ఆయన మతము, ఆయన కులము ఎవరికి తెలియవు అని సత్ చరిత్రలో తెలుగులో శ్రీ ప్రత్తి నారాయణరావు గారు మరియు శ్రీమతి మణెమ్మ గారలు తమ పుస్తకములలో వ్రాసి యున్నారు. నేను హేమాద్రిపంతుతో ఏకీభవించుతు శ్రీసాయి సత్ చరిత్రనే ప్రామాణికంగా స్వీకరించుతున్నాను. ఈ పుస్తకములో కొంత సమాచారాన్ని నామిత్రుడు కీర్తిశేషులు లెఫ్టినెంట్ కల్నల్ నింబాల్ కర్, పూనా వారు మరియు హైద్రాబాద్ వాస్తవ్యులు శ్రీయలమంచిలి చంద్రశేఖర్ గార్లు శ్రీసాయిజీవిత చరిత్రపై చేసిన పరిశోధనలు కూడా మీ ముందు ఉంచబోతున్నాను.

శ్రీసాయికి తల్లిదండ్రులు ఎవరు అన్న విషయము ఈ లోకములో సరిగా ఎవరికి తెలియదు. ఈ మధ్య చాలా మంది శ్రీసాయి సత్ చరిత్రలు వ్రాస్తున్నారు. కొందరు బాబా బ్రహ్మణ దంపతులకు జన్మించారని వారు చనిపోతే ముస్లిమ్ దంపతులు పెంచి పెద్ధచేసారని వ్రాసారు. కొందరు ఆయన జన్మ పత్రిక (జాతకచక్రం) తయారు చేసి పుస్తకాలలో ముద్రించుతున్నారు. మరియు కొందరు తమ పుస్తకాలలో బాబా తల్లిదండ్రుల పేర్లు ఈవిధంగా చెప్పారు. 1. గంగా భవాడ్యుడు + దేవగిరి అమ్మ, 2. నరహరి + అవంతిక, 3. నందలాలు + జమునాబాయి. కొందరు అయితే బాబా జెరూసలేమ్ లో జన్మించినారు అని వ్రాసారు. ఇవి అన్ని చదివిన తరువాత నాకు మతిపోయింది. అందుచేతనే హేమాద్రిపంత్ గారు వ్రాసిన శ్రీసాయి సత్ చరిత్రనే ప్రామాణికంగా తీసుకొని ఈ విషయంలో మరికొంత వివరణ ఇవ్వదలచాను. మన భారతీయ ఋషులలో వశిష్ఠ మహాముని, అగస్త్య మహామునులు అయోనిజులు కారా. అలాగే సీతామాత భూమిలో ఒక పెట్టెలో జనక మహారాజుకు దొరకలేదా? నా వుద్దేశ్యములో బాబా అయోనిజుడు. ముస్లిమ్ దంపతులు పెంచియుండవచ్చును. ఇది నా స్వంత ఆలోచన. నేను హేమాద్రిపంతు వ్రాసిన శ్రీసాయి సత్ చరిత్రనే ఆధారముగా తీసుకొని మాట్లాడుతాను.

**నిజానికి మనకు ఋషి మూలం, నది మూలం అనవసరం.** నదీ జలాలను త్రాగుతూ శారీరిక దప్పికను తీర్చుకొందాము. ఋషుల మాటలను ఆచరించుచు మన ఆధ్యాత్మిక దాహం తీర్చుకొందాము.

1842 నుండి 1854, 12 సంవత్సరాలపాటు బాల సాయి తన గురువు వద్ద శిష్యరికము చేసి యుండవచ్చును. లేదా గురుస్థానము క్రిందయున్న భూగృహములో తపస్సు చేసుకొని ఉండవచ్చును. వీటికి సరియైన సమాధానములు ఎవరు చెప్పలేకపోతున్నారు. బాబా గురువు వెంకూస లేదా రోషషా అనేది ఇంకా తేలలేదు. 1854 బాలసాయి 16 సంవత్సరముల బాలుడిగా షిరిడీలోని వేపచెట్టు క్రింద తపస్సు చేసుకొంటు దర్శనము ఇచ్చినట్లుగా నానా చోప్ దార్ తల్లి ధృవీకరించింది.

1854 నుండి 1857 వరకు బాల సాయి 3 సంవత్సరములు షిరిడీ గ్రామములోనే నివసించినారు అని నాటి పెద్దలు చెప్పిన మాట. 1857 మధ్యలో బాల సాయి షిరిడీ వదిలి దేశాటనకి వెళ్లినారు అని చాలా మంది భావించారు. నిజానికి వారు ఎక్కడికి వెళ్ళినది ఎవరికి తెలియదు.

1858 ధూప్ గ్రామ నివాసి చాంద్ పాటిల్ యొక్క గుఱ్ఱము జాడ తెలియపర్చుట. గుఱ్ఱము అంటే భగవంతుని అనుగ్రహము అని శ్రీ సత్ చరిత్రలో చెప్పారు. బాబాగారు తన చేతిలోని సటకాతో భూమిపై కొట్టి నీరు, నిప్పు వెలికి తీసి చాంద్ పాటిల్ కు చిలుము పీల్చడానికి చేసిన ఒక చిన్న చమత్కారము బాబా చేసిన సంవత్సరము. బాబా పంచభూతాలను తన ఆధీనంలో ఉంచుకొనేవారు.

1858 చాంద్ పాటిల్ పెళ్లివారితో కలిసి బాబా తిరిగి షిరిడీకి రావడము ఖండోబా మందిరము దగ్గర భక్త మహల్సాపతి వారిని 'ఆవో సాయి' అని స్వాగతించటము జరిగింది. 1858 నుండి 1918 వరకు బాబా పాడుబడిన మసీదులో 60 సంవత్సరములపాటు నివసించారు.

1859 మార్గశిర శుద్ధ పంచమినాడు అన్నాసాహెబ్ ధబోల్కర్ (బాబావారు ముద్దుగా హేమాద్రిపంతు అని పిలిచేవారు) గారు (శ్రీసాయి సత్ చరిత్ర గ్రంధకర్త) 1859 లో జన్మించారు.

1861 ద్వారకామాయి ముందు వర్షములో నిలబడలేని స్థితిలో యున్న కుష్టురోగ భక్తుడు భాగోజి షిండేను బాబా స్వయముగా తన చేతులతో లేవనెత్తి ద్వారకామాయిలోకి తీసుకొని వచ్చి ఆశ్రయము ఇచ్చిన సంవత్సరము 1861. బాబా తన చేతిని ధునిలో పెట్టినపుడు కాలిన గాయానికి కట్టుకట్టినవాడు. బాబాకు నిత్యము ద్వారకామాయిలో రాత్రివేళ నూనెదీపాలు వెలిగించే అలవాటు ఉండేది. వాటికి కావలసిన నూనెను షిరిడీలోని వైశ్యుల దుకాణము

నుండి అడిగి తెచ్చేవారు. ఒకనాడు వైశ్యులు అందరూ బాబాకు నూనె ఇవ్వడానికి నిరాకరించినారు. బాబా భగవంతునిపై నమ్మకము, విశ్వాసము ఉంచి తన తంబిరేలు డొక్కులోని నీటితో దీపాలను వెలిగించినది 1861 వ.సంవత్సరములోనే.

(ఇంకా ఉంది)

ఆనాటి ఋషులు, నేటి షిరిడి సాయి పై సాయినానిస శ్రీరావాడ గోపాలరావుగారి ప్రసంగములు మిగిలిన భాగములను వినండి.

https://www.youtube.com/watch?v=8vr9cwBf1Iw

https://www.youtube.com/watch?v=ugrdY0t8iYs



## షిరిడీ వార్తలు :

సాయిబాబా విగ్రహం చేతినుండి కారిన నీరు.

సాయిబాబా అన్న ప్రసాదం కాపౌండులో సాయిబాబా విగ్రహంలోని చేతి మధ్య వ్రేలునుండి ఏప్రిల్, 30వ.తేదీ పౌర్ణమి సోమవారం రోజున రాత్రి నీరు కారుతున్న దృశ్యం వీడియోను మహారాష్ట్రలోని అన్ని దూరదర్శన్ చానల్స్ లోను ప్రసారం చేసారు. ఇదే విధంగా మంగళవారం నాడు అనగా మే నెల 2 వ.తేదీ ద్వారకామాయిలో కూడా జరిగింది. ఈ దృశ్యం కూడా దూరదర్శన్ లో ప్రసారమయింది. సాయిబాబా దేవుడు అని ఆయన షిరిడీలోనే ఉన్నారన్నదానికి నిదర్శనం కనిపించింది. ఈ ఘటనను సాయి భక్తులు తండోపతండాలుగా వెళ్ళి దర్శించుకొని తరించారు.



## సాయి ఉపాసక్ కలం నుండి…..

మే నెల 25 వ.తారీకున బాబా అనుగ్రహంతో క్షేమంగా అమెరికాలోని అట్లాంటాకు చేరుకున్నాము. ఇక్కడినుండి కూడా మన పత్రికను ప్రచురిస్తూ ఉంటాను.

**అమెరికాలో నివసిస్తున్న సాయి భక్తులందరకూ ఒక ముఖ్య గమనిక.**

బ్రహ్మశ్రీ సాయిబానిస శ్రీ రావాడ గోపాలరావుగారు ఈ నెల అనగా జూన్ 2018, 24 వ తారీకున అమెరికాలోని సాయి భక్తులు ఆహ్వానించిన సందర్భంగా డల్లాస్ నగరానికి విచ్చేయుచున్నారు. ఆయన అమెరికాలో ఆగష్టు 12 వరకు ఉంటారు.

గురుపూర్ణిమ ఉత్సవాలు, మరియు సాయిబాబా మహాసమాధి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ క్రింద ఉదహరించిన ప్రదేశాలలో ఉన్నటువంటి సాయిమందిరాలలో ఆయన ఉపన్యాసాలను ఏర్పాటు చేసారు. కావున క్రింద ఇవ్వబడిన ప్రదేశాలు, మరియు పరిసర ప్రాంతాలలో ఉన్నటువంటి సాయి భక్తులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని సాయిబానిస శ్రీరావాడ గోపాలరావుగారి ప్రసంగాలకు హాజరవాల్సినదిగా కోరబడుచున్నారు.

ఉపన్యాస కార్యక్రమములు జరుగు ప్రదేశాలు :

| | | | |
|---|---|---|---|
| డల్లాస్ | జూలై | 7 | వ.తేదీ |
| మిన్నిపోలిస్ | జూలై | 14 | |
| హ్యూస్టన్ (టెక్సాస్) | జూలై | 21 | |
| బాల్డ్విన్ (న్యూయార్క్ ) | జూలై | 26 | |
| ఐసిలిన్ (న్యూజెర్సీ ) | జూలై | 28 | |

**అమెరికాలో ఉన్నటువంటి సాయి మందిర నిర్వాహకులు ఎవరయినా ఆయన ఉపన్యాస కార్యక్రమాలను ఏర్పాటు చేయదలచినచో ఆయనను ఈ మైల్ ద్వారా సంప్రదించగలరు.**

**saibanisa@gmail.com**

**సాయి ఉపాసక్**

**త్యాగరాజు, అట్లాంటా**

**ఫోన్. నెంబర్. 1 571 594735**

**మైల్ ఐ.డి. saidarbar@gmail.com**

